సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 24 । ఆగస్టు । 2025



24.12 ఎకరాలకు ఫెన్సింగ్

24.12 ఎకరాల ప్రభుత్వ భూమికి రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ చేశారు. 8లో▸



స్వయం శక్తితో ఎదగాలి

మహిళలు స్వయం శక్తితో ఎదగాలని జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటనారాయణ అన్నారు. 8లో▸



రద్దు చేయాలి

కేంద్రం తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం రూరల్: సీఎస్ఆర్ నిధులతో మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు అడిషనల్ కలెక్టర్ (ప్రత్యేకాధికారి) శ్రీనివాస్ సూచించారు. ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాతంగా జరుపుకొనేలా చూడాలన్నారు. సమన్వయంతో సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, మేనేజర్ రమేష్, టీపీఓ అబీబున్నీసాబేగం, డీఈ స్వర్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

మీర్‌పేట: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువు వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను శనివారం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ మున్సిపల్, విద్యుత్, పోలీసు, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, అగ్నిమాపక శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఎ.నాగమణి, ఏఎంసీ నాగేందర్‌రెడ్డి, సీఐ శంకర్‌నాయక్, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాజేశ్


ఆమనగల్లు: గణేశ్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ కోరారు. పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో శనివారం శాంతి, సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవ కమిటీలు గణేశ్ మండపాల ఏర్పాటు కోసం అనుమతి తీసుకోవాలని అన్నారు. మండపాల వద్ద అనుమతించిన డెసిబుల్స్ శబ్దం కల సౌండ్ బాక్స్‌లను ఏర్పాటు చేసుకోవాలని, ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, శాంతిభద్రతలకు ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఆమనగల్లు ఇన్‌చార్జి సీఐ గంగాధర్, ఎస్ఐ వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ శంకర్, విద్యుత్‌శాఖ ఏఈ శంకర్‌నాయక్, ఆర్అండ్‌బీ ఏఈ తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ రెహమాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంపత్, మైనర్ ఇరిగేషన్ ఏఈ తిరుపతయ్య, ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

నందిగామ తహసీల్దారుగా సైదులు



నందిగామ: నందిగామ తహసీల్దార్ రాజేశ్వర్ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మహేశ్వరం మండల తహసీల్దారుగా ఉన్న సైదులు రానున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. శనివారం అమావాస్య కారణంగా ఆయన బాధ్యతలు చేపట్టలేదు. సోమవారం రాజేశ్వర్ రిలీవ్ కానుండడంతో అదేరోజు సైదులు బాధ్యతలు చేపట్టనున్నారు.

బీసీల చైతన్యమే లక్ష్యం



మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

ఇబ్రహీంపట్నం: బీసీల చైతన్యమే లక్ష్యంగా మన ఆలోచన సమితి సమితి (మాస్) పనిచేస్తుందని సమితి రాష్ట్ర అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు అన్నారు. ఇబ్రహీంపట్నంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం బీసీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన కోసం, మన పిల్లల కోసం, మన అందరి విముక్తి కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాధికారం దక్కే వరకు అలుపెరగని పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీల్లోని వివిధ కుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

మట్టి గణపతికి జై

- వినాయక ఉత్సవాల్లో పర్యావరణానికి పెద్దపీట
- మారుతున్న మండప నిర్వాహకుల ఆలోచనా ధోరణి
- మార్కెట్లో విరివిగా మట్టి విగ్రహాల విక్రయాలు
- ఆరు అంగుళాల నుంచి ఐదు అడుగుల ఎత్తు వరకు..
- రూ.150 నుంచి రూ.14 వేల వరకు ధర



భక్తుల ఆలోచనా ధోరణి మారింది. భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నారు. ప్రమాదకరమైన ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, సింథటిక్ కలర్లతో తయారు చేసిన ఎత్తయిన విగ్రహాలకు బదులు స్వచ్ఛమైన బురద మట్టితో తయారు చేసిన ప్రతిమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ మేరకు వాటి విక్రయాలు సైతం జోరందుకున్నాయి.

హుడాకాంప్లెక్స్: వినాయక విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడంపై పర్యావరణవేత్తలు, న్యాయస్థానాలు ఆందోళన వ్యక్తం చేయడం.. పలు రకాల ఆంక్షలు విధించడం తెలిసిందే. ఎత్తయిన విగ్రహాల కొనుగోలు, రవాణా , మండపం ఏర్పాటు, ప్రతిష్ఠాపన, ఘనమైన పూజల నిర్వహణ, నిమజ్జనం వంటి అంశాల్లోనూ ఇబ్బందులు తలెత్తుతున్న విషయం విధితమే. కొన్ని సందర్భాల్లో భక్తులు ప్రమాదాలకు గురైన సంఘటనలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యక్తగత భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు పాటు పడేవిధంగా నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు.

కొనుగోళ్లకు ఆసక్తి

గతంలో ప్రధాన రోడ్లు, షాపుల్లో ఎటు చూసినా రంగులు అద్దుకున్న గణనాథుల విగ్రహాలే దర్శనమిచ్చేవి. ప్రస్తుతం మట్టి విగ్రహాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఆరు అంగుళాల నుంచి ఐదు అడుగుల ఎత్తు విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో విగ్రహం ఎత్తు, సైజును బట్టి రూ.150 నుంచి రూ.14 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇతర విగ్రహాలతో పోలిస్తే దరలు కాస్త తక్కువగా ఉండటం, పర్యావరణహితంగా విగ్రహాలను తయారు చేయడంతో మెజార్టీ భక్తులు వీటి కొనుగోళ్లకే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మట్టి విగ్రహాలపై అవగాహన కల్పిస్తున్నారు.

మండపాల్లో జాగ్రత్తలు తప్పనిసరి

తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించే వేడుకల్లో జాగ్రత్తలు తప్పనిసరని నిపుణులు పేర్కొంటున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదని హెచ్చరిస్తున్నారు. విగ్రహాల తరలింపు, మండపం ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్లు, నిమజ్జనం వరకు ఇలా ప్రతి అంశంలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.

- మండపం ఏర్పాటుకు నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల నుంచి అనుమతి పొందాలి.
- మండపాలకు విద్యుత్ కనెక్షన్లు నేరుగా తీసుకోరాదు. డిస్కం ఇంజనీర్లకు సమాచారం ఇచ్చి, వారి అనుమతి మేరకే తీసుకోవాలి. స్తంభాలను నేరుగా ఎక్కడం కానీ, లైన్లకు వైర్లను వేలాడదీయడం కానీ చేయరాదు.
- లైన్ల కింది నుంచి విగ్రహాలను తరలించే సమయంలో తడిసిన కర్రలతో కానీ ఇనుప రాడ్లతో కానీ వైర్లను తాకరాదు. అలా తాకడం ద్వారా విద్యుత్‌షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.
- సాధారణంగా మండపంలో లైటింగ్ కోసం వైర్లకు అనేక చోట్ల జాయింట్లు వేస్తుంటారు. విద్యుత్ సామర్థ్యం మేరకు ఎంపిక చేసుకోవడంతో పాటు జాయింట్లు లేకుండా చూసుకోవాలి.
- ఎంసీబీలను విధిగా ఏర్పాటు చేసుకోవాలి. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే సంబంధిత ఇంజనీరుకు/ లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వాలి.
- రాత్రి పూట విగ్రహాలకు కాపలాగా నిర్వాహకులతో పాటు పోలీసు గస్తీ ఉండేలా చూసుకోవాలి.
- డీజే, ఇతర సౌండ్ సిస్టం ఇతరులను ఇబ్బంది పెట్టే విధంగా ఉండకూడదు. రాత్రి 10 గంటల తర్వాత సౌండ్ సిస్టం నిలిపివేయాలి. లేదంటే స్థానికుల నుంచి పోలీసుస్టేషన్లకు ఫిర్యాదులు వెళ్లి కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.



సరూర్‌నగర్ ప్రధాన రహదారిపై మట్టి విగ్రహాల విక్రయం

పర్యావరణ హితం కోసమే..



సరూర్‌నగర్ పండాల అనిల్‌కుమార్ కాలనీలో ఎనిమిదేళ్ల క్రితం శ్రీ ఉమామహేశ్వర దేవాలయం నిర్మించాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు మట్టి గణపతినే ప్రతిష్ఠింపజేస్తున్నాం. పర్యావరణ హితం కోసమే మట్టి గణపతిని ఏర్పాటు చేస్తున్నాం. కాలనీలోని చిన్నా పెద్ద అంతా కలిసి తొమ్మిది రోజుల పాటు వైభవంగా వేడుకలు జరుపుకొంటాం.

– ఇంటూరి అంకిరెడ్డి, మండప నిర్వాహకుడు, సరూర్‌నగర్

బ్యాలెట్ పేపర్లు రెడీ

- 'స్థానిక' ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధం
- గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి బ్యాలెట్ బాక్సులు
- జిల్లాలో 526 జీపీలు, 4,668 వార్డులు, 4,682 పోలింగ్ స్టేషన్లు
- 'సాక్షి'తో జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేందుకు రెడీగా ఉన్నాం. ఇప్పటికే పది లక్షల బ్యాలెట్ పేపర్లు ముద్రించాం. కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ నుంచి బ్యాలెట్ బాక్సులు తెప్పించి సర్వం సిద్ధం చేశాం. జిల్లా వ్యాప్తంగా 526 పంచాయతీలు ఉండగా, వీటి పరిధిలో 4,668 వార్డులు ఉన్నాయి. ప్రతి 1,500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ బూత్ చొప్పున జిల్లా వ్యాప్తంగా 4,682 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం' అని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన మాటల్లోనే..

ఓటర్ల జాబితా సిద్ధం

2018తో పోలిస్తే ప్రస్తుతం పంచాయతీల సంఖ్య కొంత తగ్గింది. గతంలో 558 పంచాయతీలు ఉండగా, కొత్తగా చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీలు ఏర్పాటు కావడం.. ఔటర్‌కు సమీపంలో ఉన్న పలు పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో కలపడంతో 526కు తగ్గింది. ఆయా గ్రామాల పరిధిలో మొత్తం 7,94,653 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 3,99,404 మంది పురుషులు, 3,95,216 మంది మహిళలు, 33 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబితా సిద్ధం చేసి ఉంచాం.

ఆ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి

2024 జనవరి 30తో స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ముగిసింది. అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. స్థానిక సంస్థలకు పాలక మండళ్లు లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు పూర్తిగా నిలిచిపోయాయి. వీధిలైట్లు, ట్రాక్టర్లకు డీజిల్ ఖర్చులు, మంచినీటి మోటార్ రిపేర్ల కోసం నిధుల సమస్య తలెత్తుతోంది. కొన్ని సందర్భాల్లో కార్యదర్శులే సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.104.54 కోట్లు రాగా, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నుంచి రూ.4.75 కోట్లు వచ్చాయి. 75 శాతానికి కంటే తక్కువ ఆస్తిపన్ను వసూలైన పంచాయతీలపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. నిర్దేశించిన లక్ష్యం మేరకు పన్నులు వసూలయ్యేలా చేసి, సమస్యలు తలెత్తకుండా చూస్తున్నాం.

సకాలంలో వేతనాలు చెల్లిస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా 3,016 మంది పారిశుద్ధ్య కార్మికులు, 61 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు పని చేస్తున్నారు. నిజానికి వీరికి పంచాయతీల బడ్జెట్ నుంచి వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఏడాదిగా 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో వారి వేతనాలను 18 నెలల నుంచి ప్రభుత్వమే స్వయంగా చెల్లిస్తోంది. ఒక్కో పారిశుద్ధ్య కార్మికుడిని నెలకు సగటున రూ.9,500 చొప్పున, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.19,500 చొప్పున చెల్లిస్తున్నాం. ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించి రూ.7.20 కోట్లు ఇటీవలే చెల్లించాం. ఆగస్టు నెలకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే అవి కూడా చెల్లిస్తాం.

కార్యదర్శులపై నిఘా

తరచూ విధులకు గైర్హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులపై ప్రత్యేక నిఘా పెడుతున్నాం. ఇప్పటికే కచ్చితమైన హాజరు కోసం జీపీఎస్ ఆన్‌లైన్ అటెండెన్స్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చాం. ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో ఫేక్ అటెండెన్స్‌కు చెక్ పెడుతున్నాం. ఆమనగల్లు మండలం సింగంపల్లి కార్యదర్శి జంగయ్య సహా ఫరూఖ్‌నగర్ మండలం బీమారం పంచాయతీ కార్యదర్శి అనిల్‌కు మార్ఫ్ ఫేక్ అటెండెన్స్ వ్యవహారంలో సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవలే ఓ కార్యదర్శికి ఒక రోజు సర్వీసు కట్ చేశాం. ఏసీబీకి చిక్కినట్టే చిక్కి, విధులకు ఎగనామం పెడుతున్న మరో కార్యదర్శిపై కూడా వేటు పడింది. వారం రోజుల వ్యవధిలోనే ఐదుగురు సస్పెండ్ అయ్యారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని మరో 15 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశాం. ప్రభుత్వం త్వరలో బయోమెట్రిక్, ఫేస్‌రీడింగ్, ఐరిస్ అటెండెన్స్ విధానాన్ని అందుబాటులోకి తేనుంది.

రేపటి నుంచి ఫీవర్ సర్వే

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు



సమావేశంలో పాల్గొన్న వైద్యాధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడంతో పాటు సోమవారం నుంచి ఇంటింటికీ జ్వరాల సర్వే నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వరరావు సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఆశాలు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి జ్వర పీడితులను గుర్తించాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామాల్లో డెంగీ, మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త పడాలన్నారు.

సమన్వయంతో పని చేయాలి

వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని డీఎంహెచ్ఓ సూచించారు. ముందు జాగ్రత్తగా ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఏఎన్ఎంల సమన్వయంతో పంచాయతీ, మల్టీపర్పస్ సిబ్బందితో గ్రామంలో అవసరమైన పారిశుద్ధ్య పనులకు చర్యలు చేపట్టాలన్నారు. దోమల ద్వారా డెంగీ, చికున్ గున్యా మలేరియా లాంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా అన్ని హ్యాబిటేషన్లలో ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. వర్షాలకు డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా శుభ్రం చేయించాలన్నారు. వర్షం నీరు నిలువ ఉండకుండా ముందుకు ప్రవహించేలా డ్రైన్లను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షికాహయత్, డాక్టర్ విజయ పూర్ణిమ, జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల సాధనకు సత్యాగ్రహ దీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న బర్క కృష్ణ

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాద్‌నగర్: బీసీ రిజర్వేషన్ల సాధన కోసం హైదరాబాద్‌లో ఈనెల 25న సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నట్టు బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లిలో శనివారం బీసీ సేన జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్ అధ్యక్షతన బీసీ సేన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలంతా కలిసికట్టుగా పోరాటం చేస్తేనే రాజ్యాధికారం సాధ్యమని అన్నారు. బీసీల హక్కుల సాధన కోసం ఎన్నో ఏళ్లుగా ఆర్.కృష్ణయ్య పోరాటం చేస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. బీసీలంతా దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మేకల వెంకటేశ్, సుధాకర్, చంద్రశేఖర్, పాలాది శ్రీనివాస్, బాస వరలక్ష్మి, భూషణ్, నరేష్, చందూలాల్, శంకర్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించిన హైడ్రా



తుర్కయంజాల్: జేసీబీతో ప్రహరీ కూల్చివేత

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి సర్వే నంబర్ 201లోని శ్రీ సూర్య సాయి నగర్‌లో పార్కు ఆక్రమణలను శనివారం హైడ్రా అధికారుల బృందం కూల్చివేసింది. కాలనీలోని 482 గజాల విస్తీర్ణంలో 283, 284 నంబర్ ప్లాట్లను 2018లో మున్సిపాలిటీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. అయినప్పటికీ కొందరు స్థానికులు ప్రహరీ నిర్మించి ఆక్రమించారు. దీనిపై కాలనీవాసులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఇటీవల హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. తాజాగా హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేశ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం పార్కు స్థలంలోని నిర్మాణాలను కూల్చివేశారు. కొలతలు వేసి, మున్సిపల్ అధికారుల చేత బోర్డు ఏర్పాటు చేయించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా తాము 20 ఏళ్లుగా సర్వే నంబర్ 159లో కబ్జాలో ఉన్నామని, గతంలో హైడ్రా నుంచి నోటీసులు వచ్చినప్పటికీ రిప్లై ఇచ్చామని, అవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టారని కబ్జాలో ఉన్న రైతులు వాపోయారు. గతంలో హైకోర్టు నుంచి వచ్చిన తీర్పు కూడా తమకు అనుకూలంగా ఉందని గుర్తు చేశారు. హైడ్రా ఏడీ సర్వే చేపట్టి రిపోర్టు ఆధారంగా భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

ప్రీకాస్టు వాల్ తొలగింపు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో హైడ్రా అధికారులు కొరడా ఝులిపించారు. రోడ్డుకు అడ్డంగా వేసిన ప్రీకాస్టు వాల్ తొలగించి రోడ్డుకు విముక్తి కల్పించారు. మున్సిపల్ కేంద్రంలోని బీరప్ప గుడికి సమీపంలో చక్రధర వెంచర్‌లో రోడ్డుకు అడ్డంగా కొంతమంది ప్రీకాస్టు వాల్ నిర్మించారు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారుల దృష్టికి వెళ్లడంతో శనివారం హైడ్రా సీఐ తిరుమలేశ్ ఆధ్వర్యంలో జేసీబీలతో వాటిని తొలగించారు. ఈ సందర్భంగా సీఐ తిరుమలేష్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా పనులు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు. నిర్భయంగా హైడ్రాను సంప్రదిస్తే తగున్యాయం చేస్తామని తెలిపారు.

ఆగమన్‌కు ‘విఘ్నం’

ఓఆర్‌ఆర్ బ్రిడ్జి కింద ఇరుక్కుపోయిన వినాయక ప్రతిమ



నగరంలోని కాటేదాన్ నుంచి మణికొండకు భారీ వినాయక ప్రతిమను తీసుకువెళ్తుండగా మార్గ మధ్యలో పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు బ్రిడ్జి కింద ఇరుక్కుపోయింది.గంటల కొద్దీ ప్రయత్నం చేసినా విగ్రహం బయటకు రాలేదు. చివరకు విగ్రహం కొంతమేర ధ్వంసమైన తర్వాత బ్రిడ్జిని దాటించారు. దీంతో పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. – అబ్దుల్లాపూర్‌మెట్

చిత్రపురి సొసైటీపై మరో కేసు నమోదు

గచ్చిబౌలి: ప్లాట్ల అలాట్‌మెంట్లలో గోల్‌మాల్‌పై చిత్రపురి సొసైటీపై రాయదుర్గం ఠాణాలో మరో కేసు నమోదైంది. చిత్రపురి సొసైటీలో మెంబర్‌గా ఉన్నా వి.దినేష్ కుమార్ రెడ్డికి 2012లో ఎంఐజీ–9–803 ఫ్లాట్‌ను అలాట్ చేశారు. అదే ఫ్లాట్‌ను 2022న ఆళ్ల శివకృష్ణ అనే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్రపురి సొసైటీ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్, కార్యదర్శి దొరతో పాటు కమిటీ సభ్యులపై కేసు నమోదు చేశారు.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న రాజు తదితరులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

కేశంపేట: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానంతో ఐసీడీఎస్, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా ఉందని.. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. ప్రీప్రైమరీ, పీఎం శ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని కోరుతూ ఎంఈఓ చంద్రశేఖర్‌కు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ అంగన్‌వాడీ టీచర్లు సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖులు మన్ననలు పొందిన ఐసీడీఎస్ వ్యవస్థను ఎత్తివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్య కారణంగా సంవత్సరాల లోపు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల పైన తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. చిన్నారులకు విద్యకంటే పౌష్టికాహారం ముఖ్యమన్నారు. ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే అందించేందుకు బోధనా బాధ్యతలను అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకే అందించాలన్నారు. విద్యా వలంటీర్లకు నిర్ణయించిన వేతనాన్ని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు అదనంగా అందించాలన్నారు. ఆరేళ్లలోపు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్చుకోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు సంబంధం లేని బీఎల్ఓ తదితర అదనపు పనులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శశికళ, లక్ష్మి, శివలీల, సుగుణ, సుమలత, సుష్మ, సుమతి, నిర్మలమ్మ, విజయలక్ష్మి, నిర్మల, వినోద, జయమ్మ, భాగ్యలక్ష్మి, అమృత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సయ్యద్ రసూల్(ఫైల్)

మొయినాబాద్: మద్యం సేవించవద్దన్నందుకు భార్యతో గొడవపడిన వ్యక్తి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి చిలుకూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధి / లోని చిలుకూరు ఇంద్రారెడ్డినగర్ కాలనీలో నివసిస్తున్న సయ్యద్ రసూల్ భార్య నజ్నిన్ శుక్రవారం రాత్రి మద్యం తాగొద్దంది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రాత్రి 8.30 గంటల ప్రాంతంలో రసూల్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

గన్‌తో బెదిరించి తండ్రీ కొడుకులపై దాడి

విజయనగర్‌కాలనీ: గన్‌తో బెదిరించి కత్తితో దాడిచేసిన సంఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగు చూసింది. ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం..మంగళ్‌హాట్‌కు చెందిన ఓ బాలుడు (16) ఈ నెల 22న మెహిదీపట్నంలోని మజీద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆసిఫ్‌నగర్ సెయింటాన్స్ బాలికోన్నత పాఠశాల వద్దకు రాగానే ఓ స్కార్పియో కారులో వచ్చిన కొందరు యువకులు పక్కకు తప్పుకోవాలంటూ అతన్ని దుర్భాషలాడుతూ...వాహనాన్ని ఆపి గన్‌తో బెదిరించారు. భయభ్రాంతులకు గురైన ఆ యువకుడు తన తండ్రి అఫ్సర్ అలీ సయ్యద్ ఫారూఖ్‌కు సమాచారం అందించాడు. అక్కడకి చేరుకున్న ఫారూఖ్ విషయం ఏంటని ప్రశ్నించగా..అతడిపై కూడా కత్తితో దాడిచేశారు.

హరితం.. ఆహ్లాదం

- ఇంటి ఆవరణలో మొక్కలు నాటేందుకు అనువైన సమయం
- వనమహోత్సవంలో భాగంగా మొక్కల పంపిణీ



ఇంటింటికి మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

షాద్‌నగర్: ఇటీవల ఇంటి ఆవరణలో మొక్కల పెంపకంపై ఆసక్తి పెరిగింది. వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటడానికి అనువుగా ఉంటుంది. ప్రభుత్వం వనమహోత్సం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేస్తుంది.

వాయుకాలుష్యంతో ముప్పు

రోజు రోజుకు వాతావరణం కలుషితమవుతతోంది. చెట్ల సంఖ్య తగ్గడంతో సహజంగానే ధూళి కణాలు గాలిల్లో కలుస్తున్నాయి. ఫలితంగా ఇది ప్రజారోగ్యానికి శాపంగా మారింది. ప్రతి ఏటా వాయు కాలుష్యంతో పలువురు మృత్యువాత పడుతుండగా ఎందరో అనారోగ్యానికి గురవుతున్నారు.

మొక్కలు నాటడం

- వర్షాలు కురుస్తుండటంతో ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో మొక్కలు నాటుకోవచ్చు.
- ఇండోర్ ప్లాంట్ల పై ఇటీవల ఆసక్తి కనబరుస్తున్నారు.
- మల్లె, చామంతి, గులాబీ, ఆర్‌కే ఫామ్, సైకస్, కాకస్, జెర్బరా, ఉసిరి, లిల్లీ, అశ్వగంధ, ఆర్కిడ్, క్రోటాన్, మనీప్లాంట్, స్నే ప్లాంట్, పుదీనా, తులసీ, అలోవెరా, సరస్వతీ తదితర రకాలు ఇంటి పరిసరాల్లో నాటుకోవచ్చు.
- జమ్మి, మేడి, ఉత్తరేణి, తెల్ల జిల్లేడు, దత్తాత్రేయ, మారేడు, గరిక, బ్రహ్మ కమలం, వంటి నవగ్రహాల మొక్కల సైతం నాటుకోవచ్చు.
- స్థలం ఎక్కువగా ఉంటే మామిడి, సీతాఫలం, జామ, వాటర్ ఆపిల్, బత్తాయి, జామ, దానిమ్మ, వంటి పండ్ల మొక్కలను నాటొచ్చు.

కురగాయలకు ఎండే అండ

నేల పై లేదా ఇంటి మేడ పై ప్లాస్టిక్ గ్రో బ్యాగులు, సిమెంట్ కుండీల్లో, పాత బకెట్లు, రంజన్లలో మొక్కలు పెంచుకోవచ్చు. అద్దె ఇంటిలో ఉంటున్న వారు కుండీల్లో పెంచితే మరో చోటుకు సులభంగా తరలించవచ్చు. తీగ జాతి మొక్కలతో చిన్న మొక్కలకు ఇబ్బంది రాకుండా తాళ్ల సాయంతో పైకి పాకించాలి. చీడ పీడలు ఆశిస్తే వేపనూనె లేదా కార్బండిజం, మ్యాంకోజెబ్, మోనోక్రోటోపాస్ కలిపిన మిశ్రమాన్ని మొక్కల పై పిచికారీ చేయాలి. రోజులో కనీసం ఆరు గంటలు సూర్యరశ్మి తగిలే ప్రాంతాల్లో టమాట, బీర, బెండ, పొట్ల, చిక్కుడు, కాకర, వంకాయ, మిరపలతో పాటు ఆకు కూరల సాగుకు అనుకూలంగా ఉంటుంది.

మట్టి ఎప్పుడు మార్చాలంటే..

- ప్రతీ రెండేళ్లకు వానాకాలం ఆరంభంలో కుండీల్లోని మట్టిని మార్చాలి.
- ఎర్ర మట్టి లేదా సారవంతమైన మన్ను, ఇసుక, పశువుల పేడ, వర్మికంపోస్టు, ఎండుటాకులు, రంపపు పొట్టు, బొగ్గు, లిండేన్ పొడిని కలిపి కుండీల్లో నింపుకోవాలి.
- కుండీల్లో తయారయ్యే అమ్మోనియాన్ని బొగ్గు పీల్చేస్తుంది. లిండేన్ పొడి పురుగులను చంపుతుంది. ఇసుక, ఆకులు, రంపపు పొట్టు నేలలో గాలి ప్రసరణకు, తేమను నిలిపేందుకు దోహదపడతాయి.
- అతి తక్కువ పరిమాణంలో యూరియా, డీఏపీ, పొటాష్, జింక్ కలిపి వేయాలి
- నీటిలో కరిగే ఎరువులను మొక్కల పై పిచికారి చేయాలి. కుండీల్లో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి

పర్యావరణాన్ని కాపాడాలి



పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరు భాగస్వామ్యం కావాలి. వనమహోత్సం కార్యక్రమంలో భాగంగా పూలు, పండ్ల మొక్కలను ఇంటింటికి పంపిణీ చేస్తున్నాం. ప్రతీ ఒక్కరు మొక్కలు, నాటడంతో పాటుగా వాటిని కాపాడాలి.

– సునీత, మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్

విద్యుత్ తీగల చోరీ

కడ్తాల్: బీవీఆర్ వెంచర్‌లో విద్యుత్ వైర్ల చోరీ ఘటన మరువక ముందే.. శుక్రవారం రాత్రి మరో వెంచర్లో 20 స్తంభాల నుంచి విద్యుత్ తీగలను కత్తిరించుకు వెళ్లారు. ఈ ఘటన కడ్తాల్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలోని టోల్‌గేట్ సమీపంలో జేజేఆర్ వెంచర్లో ఈ నెల 22న రాత్రి గుర్తు తెలియని దుండగులు విద్యుత్ వైర్లను అపహరించారు. శనివారం ఉదయం వెంచర్ యజమాని రాధాకిషన్ రెడ్డి వెళ్లిచూడగా విద్యుత్ తీగలు కనిపించ లేదు. దీంతో ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

డిగ్రీ ప్రవేశానికి గడువు పెంపు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అధ్యాపకులు

ఇబ్రహీంపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ ప్రవేశానికి గడువును ఈ నెల 30 వరకు పెంచామని అధ్యాపకుడు డా.ఈ.శంకర్ తెలిపారు. శనివారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ రాధికతో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్కువ ఫీజుతో డిగ్రీ కోర్సులను పూర్తి చేసే అవకాశాన్ని యూనివర్సిటీ కల్పించిందని తెలిపారు. రెగ్యులర్ కోర్సులతో దూరవిద్య సమానమేనని పేర్కొన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే 9441512966 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి



మాట్లాడుతున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం: వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి సూచించారు. శనివారం ఓ ఫంక్షన్ హాల్‌లో డివిజన్ స్థాయిలో గణేశ్ ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ సునీతారెడ్డి మాట్లాడుతూ.. ఉత్సవ కమిటీ నిర్వాహకులు జాగ్రత్తలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. శాంతియుతంగా నిమజ్జన శోభాయాత్ర నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, ఆర్డీఓ అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం, మంచాల, ఫార్మాసిటీ, ఆదిబట్ల, మాడ్గుల సీఐలు, విద్యుత్ ఏఈ, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిదిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మామిడి కిశోర్ ప్రకారం... శివరాంపల్లి పిల్లర్ నంబర్ 3వ వద్ద ఓ యువకుడు పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. యువకుడి వయస్సు 30–35 ఏళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడు స్థానికంగా భిక్షాటన చేస్తూ ఉండేవాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పంచనామా నిర్వహించిన పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మా ర్చురీకి తరలించారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే ఉస్మానియా మార్చురీ సిబ్బంది లేదా రాజేంద్రనగర్ పోలీసులను సంప్రదించాలన్నారు.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి



స్ట్రీట్‌ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన మెప్మా పీడీ వెంకటనారాయణ, కమిషనర్ బాలకృష్ణ

మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటనారాయణ

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళలు స్వయం శక్తితో ఎదగాలని జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వెంకటనారాయణ అన్నారు. మున్సిపాలిటీల్లో వంద రోజుల ప్రణాళిక ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం మహిళా స్వయం శక్తి సంఘాల ఆధ్వర్యంలో ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయంలో స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటనారాయణ మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని తెలిపారు. ఆర్థిక ప్రగతితో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేలా సహాయ సహకారాలు అందించాలని చెప్పారు. మహిళా స్వయం సహాయ సంఘాలను బలోపేతం చేయడానికి దశల వారీగా వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్ట్రీట్ వెండర్స్ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించామన్నారు. మహిళలను చైతన్యం చేసి స్వయం శక్తితో ఎదిగేలా చూడాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలకృష్ణ, ఏడీఎంసీ అశోక్, చైతన్యం, మేనేజర్ రమేశ్, టీపీఓ అబీబున్నీసాబేగం, డీఈ స్వర్ణకుమార్, సీనియర్ అసిస్టెంట్ స్వప్న, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

24.12 ఎకరాలకు ఫెన్సింగ్

అధికారులతో వాగ్వాదానికి దిగిన రియల్టర్లు



రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులతో రియల్ వ్యాపారుల వాగ్వాదం

మహేశ్వరం: మండల పరిధిలోని మంఖాల్ రెవెన్యూ తుక్కుగూడ పరిధిలోని వర్టెక్స్ వెంచర్ సమీపం సర్వే నెంబర్ 68, 70, 71, 73, 85, 86లో ఉన్న 24.12 ఎకరాల ప్రభుత్వ భూమికి రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు పోలీసుల సహకారంతో శనివారం చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ చేశారు. గతంలో ఈ భూమిని ప్రభుత్వం తుక్కుగూడలో భూమి లేని పేదలకు పంపిణీ చేసింది. సదరు భూమిని రైతులు ఓ రియల్ వ్యాపారికి విక్రయించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పీఓటీ నోటీసులు జారీ చేసి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి చుట్టూ పోలీసుల సహకారంతో రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు ఫెన్సింగ్ పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న పలువురు రియల్ వ్యాపారులు రెవెన్యూ, హెచ్‌ఎండీఓ అధికారులకు అడ్డుతగిలి మా పట్టా భూమిని స్వాధీనం చేసుకోవద్దంటూ వాగ్వావాదానికి దిగారు. ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి జోక్యం చేసుకుని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేస్తున్నామని, పట్టా భూమి జోలికి రావడం లేదని సర్ది చెప్పారు. పట్టా భూమి ఉంటే సర్వే చేసి కొలిచి చూపుతామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. దీంతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి చుట్టూ పోలీసుల పహారాలో ఫెన్సింగ్ పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్, సీలింగ్ భూములను విక్రయిస్తే పీఓటీ కింద ప్రభుత్వం సాధీనం చేసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, హెచ్‌ఎండీఓ తహసీల్దార్ దివ్య, హెచ్‌ఎండీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్, మహేశ్వరం డిప్యూటీ తహసీల్దార్ నరేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

ఇబ్రహీంపట్నం: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని, విద్యాశాఖకు మంత్రిని నియమించాలి ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బస్టాండ్ వద్ద చేపటిన దీక్షలో ఫెడరేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు పి.జగన్, డివిజన్ అధ్యక్షుడు వంశీ, కార్యదర్శి తరంగ్‌లు మాట్లాడారు. ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.8,150 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఫీజు చెల్లించని కారణంగా పై చదువుల కోసం విద్యార్థులు కళాశాలల యాజమాన్యం వద్దకు వెళితే.. ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని మొండికేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖను తన వద్దనే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. విద్యార్థుల సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కరించని నేపథ్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్, ఎస్ఎఫ్ఐ నాయకులు జస్వంత్, వినయ్, ప్రదీప్, కిషోర్, నగేష్, విజయ్, రాకేష్, చరణ్, శరత్‌లు పాల్గొన్నారు.